వైఎస్సార్ సీపీలో జోష్

- 'ఆసరా' విజయవంతంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం
- సభకు భారీగా తరలి వచ్చిన మహిళలు
- అంబేడ్కర్ భవన నిర్మాణానికి ఎంపీల హామీ


ఎంపీ మిథున్‌రెడ్డిని గజమాలతో సన్మానిస్తున్న నాయకులు

పలమనేరు: పట్టణంలో వైఎస్సార్ ఆసరా సభ విజయవంతం కావడంతో వైఎస్సార్‌సీపీ శ్రేణుల్లో ఉత్సాహం నిండింది. పట్టణంలో జరిగిన ర్యాలీలో భారీ స్థాయిలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మదనపల్లె రోడ్డు నుంచి ఆర్టీసీ బస్టాండు వరకు జనంతో కిక్కిరిసింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రాజంపేట పార్లమెంట్ సభ్యులు, పార్లమెంటు ప్యానెల్ స్పీకర్ మిథున్‌రెడ్డిని ఎమ్మెల్యే వెంకటేగౌడ నాయకులతో కలసి గజమాలతో ఘనంగా సన్మానించారు. సభా వేదిక వద్ద ఆయన నేతలు, అధికారులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రూపు మహిళలతో కలిసి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. మెగా చెక్కును అందజేశారు. ఆర్డీఓ మనోజ్‌కుమార్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ నేత ఆర్వీఎస్ బోస్, పార్టీ పట్టణ మాజీ కన్వీనర్ మండీసుధా, విశ్వ బ్రాహ్మణ అభివృద్ధి సంస్థ చైర్మన్ పవిత్ర, ఎంపీపీ రెడ్డెప్ప, బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి ప్రసంగించారు. అనంతరం ఎంపీ మిథున్‌రెడ్డి అక్కడ గ్రూపు మహిళలు ఏర్పాటు చేసిన వివిధ స్టాళ్లను పరిశీలించి, వారిని అభినందించారు. బహిరంగ సభకు సమీపంలోని బాలాజీ సూపర్‌బజార్‌ను ఆయన సందర్శించారు. ఈ కార్యక్రమానికి భారీగా మహిళలు హాజరయ్యారు. స్థానిక ఎస్సీ నేతలు పట్టణంలో అంబేడ్కర్ భవన నిర్మాణం కావాలని ఎంపీలు, మిథున్‌రెడ్డి, రెడ్డెప్పకి విజ్ఞప్తి చేశారు. వారు స్పందిస్తూ ఇందుకు నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం నియోజకవర్గంలోని పలువురు నాయకులు మిథున్‌రెడ్డిని సన్మానించారు. ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, పార్టీ రాష్ట్ర కార్యదర్శులు బైరెడ్డిపల్లె కృష్ణమూర్తి, మురళీకృష్ణ, రంగన్న, మున్సిపల్ వైస్ చైర్మన్లు గుల్జార్ రహీంఖాన్, రవి, ఎంపీపీలు మొగసాల రెడ్డెప్ప, యువరాజ్, లాయర్ రెడ్డెప్ప, కమిషనర్ రమణారెడ్డి, కన్వీనర్లు జాఫర్, బాలాజీనాయుడు, బాగారెడ్డి, మోహన్‌రెడ్డి, బాలగురునాథ్, మున్సిపల్ కౌన్సిలర్లు, మెప్మా సీఎంఎం ఉమేష్‌జాదవ్, వైఎస్సార్‌సీపీ నేతలు, పార్టీ అనుబంధ విభాగాల నేతలు పాల్గొన్నారు.


టెర్రకోట మహిళా గ్రూపు సభ్యులతో ముచ్చటిస్తున్న మిథున్‌రెడ్డి


మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన నవరత్నాల రంగవల్లి

వైఎస్సార్ సీపీతోనే కుప్పం అభివృద్ధి


బెగ్గిలిపల్లెలో మాట్లాడుతున్న పద్మమ్మ

గుడుపల్లె: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే కుప్పం అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్సీ కేఆర్‌జే భరత్ తల్లి పద్మమ్మ తెలిపారు. బుధవారం మండలంలోని బెగ్గిలిపల్లె, నల్లగాంపల్లెలో ఆమె ఇంటింటి ప్రచారంలో పాల్గొన్నారు. కుప్పం నియోజకవర్గం అభివృద్ధి చెందాలంటే వైఎస్సార్ సీపీ మళ్లీ అధికారంలోకి రావాల్సిన అవసరం ఉందని తెలిపారు. పథకాల లబ్ధిని వివరించారు. నాయకులు నాగభూషణం, మునెప్ప, అంగడిరాజు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో ప్రభుత్వ బడులు


మాట్లాడుతున్న ఎంపీపీ వరలక్ష్మి

గుడుపల్లె: పేద కుటుంబాల పిల్లలు ఉన్నత చదువులు చదివేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు పథకాలను అమలు చేస్తున్నారని ఎంపీపీ వరక్ష్మి తెలిపారు. బుధవారం కంచిబందార్లపల్లె ప్రాథమిక పాఠశాలలో జరిగిన పేరెంట్స్ కమిటీ సమావేశంలో ఆమె పాల్గొని ప్రసంగించారు. నాడు–నేడు కింద పాఠశాలలను ఆధునికీకరించారని తెలిపారు. విద్యాకానుక కింద యూనిఫాం, షూలు, పాఠ్యపుస్తకాలు అందజేస్తున్నారని చెప్పారు. 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లు అందజేస్తున్నారని తెలిపారు. అమ్మఒడి కింద తల్లుల ఖాతాలకు రూ.14 వేలు అందిస్తున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. పిల్లలకు మంచి భవిష్యత్తు కావాలంటే రానున్న ఎన్నికల్లో జగనన్నను ఆశీర్వదించాలన్నారు. ఈవో పీఆర్‌డి శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఐసీడీఎస్‌ను బలోపేతం చేయాలి

పుంగనూరు: ఐసీడీఎస్‌ను బలోపేతం చేసేందుకు ప్రత్యేక నిధులు కేటాయించాలని ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు డిమాండ్ చేశారు. బుధవారం పుంగనూరు ప్రాజెక్టు కార్యాలయంలో సమావేశం జరిగింది. ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఐసీడీఎస్‌శాఖకు బడ్జెట్‌లో నిధులు తగ్గించడం ఏమిటని ప్రశ్నించారు.

ఏకగ్రీవంగా నూతన కమిటీ

పుంగనూరు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ నూతన కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు జిల్లా గౌరవాధ్యక్షుడు వాడగంగరాజు తెలిపారు. అధ్యక్షురాలుగా కల్పన, గౌరవ అధ్యక్షురాలుగా పద్మ, కార్యదర్శిగా లీలావతి, కోశాధికారిగా చంద్రావతిని ఎన్నుకున్నట్లు పేర్కొన్నారు. వీరితో పాటు మరో 15 మందిని కమిటీ సభ్యులుగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు.

సమన్వయంతో ప్రగతి సాధించాలి


మాట్లాడుతున్న ఎంపీపీ రామమూర్తి

చౌడేపల్లె: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంగా పనిచేస్తూ మండలాన్ని ఆదర్శంగా నిలపాలని ఎంపీపీ రామమూర్తి సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ రానున్న వేసవి కాలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ఇప్పటి నుంచే ముందస్తు చర్యలు తీసుకోవాలని తెలిపారు. రైతులకు లాభసాటి వ్యవసాయంపై అవగాహన కల్పించాలని సూచించారు. గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని కోరారు. ఉపాధి పథకం కింద 13 రకాల పండ్ల తోటల పెంపకం పనులను సన్న, చిన్న కారు రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను పశువులకు రైతులు వేయించాలని తెలిపారు. రాయితీకి చాఫ్‌కట్టర్ అందుబాటు ఉందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీ నరసింహులు యాదవ్, సుధాకర్‌రెడ్డి, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, ఎంపీడీఓ వెంకటేశు, కోఆప్షన్ మెంబర్ సాదిక్ బాషా పాల్గొన్నారు.

పుల్వామా అమర వీరులకు జోహార్


కల్లూరులో..


మౌనం పాటిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

చౌడేపల్లె: పుల్వామా దాడిలో అమరులైన వీర జవానులకు బుధవారం ప్రజాప్రతినిధులు, అధికారులు నివాళులర్పించి, రెండు నిమిషాలు మౌనం పాటించారు. ఎంపీడీఓ కార్యాలయంలో జరిగిన ఈకార్యక్రమంలో వైఎస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ 2019 ఫిబ్రవరి 14న జమ్మకశ్మీర్‌లోని పుల్వామాలో ఉగ్రమూకల దాడిలో 40 మంది భారత జవానులు వీర మరణం పొందారని ఈ సందర్భంగా గుర్తుచేశారు. పాకిస్తాన్ ఉగ్రమూకల దాడిలో భీకర పోరులో మృతిచెందిన ప్రతిసైనికుడికి నివాళులర్పించారు. వారి ఆత్మలకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామమూర్తి, పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో..

పులిచెర్ల(కల్లూరు): పుల్వామా దాడిలో మృతి చెందిన అమరవీరులకు కల్లూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం శ్రద్ధాంజలి ఘటించారు. క్లబ్ క్రీడా విభాగం అధ్యక్షుడు మహమ్మదాలీ ఆధ్వర్యంలో కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పించారు. విద్యార్థులు పాల్గొన్నారు.

ద్రవిడ వర్సిటీలో క్లీన్ అండ్ గ్రీన్

కుప్పం: ద్రవిడ వర్సిటీలో బుధవారం ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో పాటు విద్యార్థులు క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వర్సిటీ వీసీ ఆచార్య కొలకలూరి మధుజ్యోతి మాట్లాడుతూ పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే ఆరోగ్యం, ఆనందం లభిస్తుందని అన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ఆరోగ్య, ప్రశాంతమైన వాతావరణం ఉట్టిపడాలన్నారు. నెల రోజులు పాటు స్వచ్ఛత కార్యక్రమాలు చేపట్టి క్లీన్ వర్సిటీ క్యాంపస్‌గా తీర్చిదిద్దాలని సూచించారు. అధ్యాపకులు పాల్గొన్నారు.

షాదీమహల్ కమిటీ ఏర్పాటు

రామకుప్పం: స్థానిక షాదీమహల్, ఉర్దూఘర్ నూతన కమిటీని బుధవారం ప్రకటించారు. చైర్మన్‌గా నాసీర్‌బాషా, సభ్యులుగా నిజాం, నూర్ అహ్మద్, ఇలియాజ్, హసీనాను నియమించారు. ఎమ్మెల్సీ భరత్ చేతుల మీదుగా నూతన కమిటీ సభ్యులు నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, మండల కోఆప్షన్ సభ్యుడు బరకతుల్లా, తజ్‌ముల్ పాషా, వైస్ సర్పంచ్ ఏజస్, జిల్లా మైనారిటీ ప్రధాన కార్యదర్శి తప్రోజ్, జబీవుల్లా పాల్గొన్నారు.

సారా తయారీ కేంద్రాలపై దాడులు


సదుం: సారా ఊట ధ్వంసం చేస్తున్న పోలీసులు

సదుం: మండలంలోని గంటావారిపల్లె అటవీ ప్రాంతంలో సారా తయారీ కేంద్రాలపై దాడులు చేసినట్టు సీఐ కృష్టారెడ్డి, ఎస్ఐ మారుతి బుధవారం సాయంత్రం తెలిపారు. ఈదాడుల్లో 300 లీటర్ల సారా ఊట ధ్వంసం చేసి, 8 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గాయంతో దూడ మృతి

రామకుప్పం: మండలంలోని 89 పెద్దూరు అటవీప్రాంతం పరిధిలోని ఉప్పువంక ప్రాంతంలో మంగళవారం సాయంత్రం స్థానిక రైతు రవికి చెందిన దూడ తీవ్ర గాయంతో మృతిచెందింది. రవికి చెందిన రెండు ఆవులతోపాటు దూడ మేత కోసం ఉప్పువంక అటవీప్రాంతానికి వెళ్లాయి. సాయంత్రం ఆవులు మాత్రం ఇంటికి తిరిగి వచ్చాయి. బుధవారం ఉదయం స్థానికులతో కలసి రవి అడవిలో గాలించాడు. తీవ్రగాయంతో గాయపడి మృతి చెందిన దూడను గుర్తించారు. చిరుత దాడిలో దూడ మృతిచెందినట్లు భావిస్తున్నారు. ఇదే విషయమై కుప్పం రేంజర్ వైసీ రెడ్డిని వివరణ కోరగా, దూడ గాయాన్ని బట్టి పేలుడు పదార్థం తిని చనిపోయి ఉంటుందన్నారు. వన్యప్రాణుల వేట కోసం అడవిలో పేలుడు పదార్థం ఏర్పాటు చేసి ఉంటారన్న దిశగా దర్యాప్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు.

పంట నమోదుకు ఈకేవైసీ తప్పనిసరి


మాట్లాడుతున్న ఏడీఏ ఉమ

ఐరాల: వ్యవసాయ సంబంధిత రుణాలు పొందేందుకు రైతులు పంట నమోదుతోపాటు ఈకేవైసీ తప్పకుండా చేయించుకోవాలని ఏడీఏ ఉమ సూచించారు. స్థానిక ఆర్బీకేలో బుధవారం ఆమె సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పీఎం కిసాన్‌కు సంబంధించి ఈ–కేవైసీ పెండింగ్‌లో ఉన్న రైతులచే నమోదు ప్రక్రియను పూర్తిచేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ వరలక్ష్మి, వీఏఏలు పాల్గొన్నారు.

గంగవరంలో మిథున్‌రెడ్డికి ఘన స్వాగతం


మిథున్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు

గంగవరం: పలమనేరులో బుధవారం 4వ విడత ఆసరా కార్యక్రమంలో పాల్గొనేందుకు వెళుతున్న రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డికి గంగవరం ఫ్లైఓవర్ వద్ద ఎంపీ రెడ్డెప్ప, ఎమ్మెల్యే వెంకటేగౌడ, పూతలపట్టు నియోజకవర్గ ఇన్‌చార్జి సునీల్‌కుమార్, ఆర్వీఎస్ బోస్‌తో పాటు నియోజకవర్గ పార్టీ నాయకులు ఘన స్వాగతం పలికి సత్కరించారు. అక్కడి నుంచి భారీ కాన్వాయ్‌తో పలమనేరులో జరిగే ఆసరా కార్యక్రమం వేదిక వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బైరెడ్డిపల్లి కృష్ణమూర్తి, మండల కన్వీనర్లు మోహన్‌రెడ్డి, బాలాజీ నాయుడు, పలమనేరు ఏరియా ఆస్పత్రి కమిటీ చైర్మన్ చెంగారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రహ్లాద, నాయకులు చంద్రప్ప, శ్రీరాములురెడ్డి, గిరిరాజారెడ్డి, చలపతిరెడ్డి, ఇతర మండలాల నాయకులు పాల్గొన్నారు.

మౌలిక వసతులపై దృష్టి పెట్టండి


రికార్డులు పరిశీలిస్తున్న జెడ్పీ చైర్మన్

వి.కోట: సచివాలయ సిబ్బంది గ్రామాల్లో మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి సారించి, సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు అన్నారు. బుధవారం మండలంలోని కృష్ణాపురం సచివాలయం, రైతుభరోసా కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, సీఎల్, మూమెంట్ రిజిస్టర్లు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ సచివాలయ సర్వీస్ రిజిస్టర్లను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ జగనన్న లేఅవుట్‌ల్లో మౌలిక వసతులపై దృష్టి సారించాలన్నారు. లబ్ధిదారులతో మాట్లాడి త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

సిద్ధం సభను విజయవంతం చేద్దాం


మాట్లాడుతున్న అంజిబాబు

చౌడేపల్లె: అనంతపురం జిల్లా రాప్తాడులో ఈనెల 18వ తేది తలపెట్టిన సిద్ధం సభను విజయవంతం చేద్దామని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ అంజిబాబు పిలుపునిచ్చారు. ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో ప్రజాప్రతినిధులు, పార్టీ నేతలతో సమావేశం జరిగింది. సిద్ధం సభకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరు కానున్నారని, ప్రతి పంచాయతీ పార్టీ శ్రేణులు హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఎంపీపీ రామమూర్తి, వైస్ ఎంపీపీలు సుధాకర్‌రెడ్డి, నరసింహులు యాదవ్, సింగిల్‌విండో చైర్మన్ రవిచంద్రారెడ్డి, జంగమ లింగాయత్ సంఘం జిల్లా అధ్యక్షుడు ఠాణాధార్ నాగరాజ, బోయకొండ కమిటీ సభ్యుడు పవన్‌కుమార్, పీహెచ్‌సీ కమిటీ చైర్మన్ కల్యాణ్‌భరత్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, నేతలు పాల్గొన్నారు.

నేడు సేవాలాల్ మహరాజ్ జయంతి


మాట్లాడుతున్న ముడేఈశ్వర్‌నాయక్

పుంగనూరు: సుగాలిమిట్ట పరిధిలోని ఏడుతాండాల ఆధ్వర్యంలో సేవాగడ్ వద్ద బంజారాల ఆరాధ్యదైవం సేవాలాల్ మహారాజ్ 285వ జయంతిని గురువారం నిర్వహిస్తున్నట్లు అడహాక్ కమిటీఅధ్యక్షుడు ముడేఈశ్వర్‌నాయక్ తెలిపారు. బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 10 గంటలకు పట్టణంలో ఊరేగింపుతో పాటు సేవాగడ్‌లో భోగ్‌బండారతో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

తల్లిపాలే పిల్లలకు శ్రేష్టం


మాట్లాడుతున్న సీడీపీఓ అరుణశ్రీ

కుప్పంరూరల్: తల్లిపాలే పిల్లలకు శ్రేష్టమని ఐసీడీఎస్ సీడీపీఓ అరుణశ్రీ అన్నారు. బుధవారం కుప్పం పట్టణంలోని అంగన్‌వాడీ కేంద్రంలో క్యాన్సర్ నివారణ దినోత్సవంలో భాగంగా గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ తల్లిపాలు ఇస్తే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని, తల్లులకు బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చే అవకాశాలు తక్కువగా ఉంటాయని తెలిపారు. జింక్‌ఫుడ్స్‌తో అనారోగ్యం పాలయ్యే అవకాశాలు ఎక్కువగా ఉంటాయన్నారు. పీఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు, విద్యార్థులు క్యాన్సర్‌పై మహిళలకు అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్ దిల్‌షాద్, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన


అవగాహన కల్పిస్తున్న అధికారులు

పలమనేరు: మున్సిపల్ పరిధిలోని రాధాబంగ్లా, మున్సిపల్ కార్యాలయ సమీప పోలింగ్ కేంద్రాల్లో నోడల్ ఆఫీసర్ ఖాదర్‌మొహిద్దీన్, సిబ్బంది బుధవారం ఈవీఎంల ద్వారా ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలో ఓటర్లకు ప్రయోగాత్మకంగా అవగాహన కల్పించారు. ఓటు హక్కును ఎలా వినియోగించుకోవాలి, ఓటర్ స్లిప్‌ను ఎలా పొందాలి, ఎన్నికల కార్డు, బూత్‌లో ఓటు వేసే విధానాలను వివరించారు. బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రైవేటులో 25 శాతం ఉచిత సీట్లు


మాట్లాడుతున్న ఎంఈఓ లీలారాణి

పలమనేరు: ప్రభుత్వ ఆదేశాల మేరకు పట్టణంలోని అన్ని ప్రయివేటు పాఠశాలల్లో 2024–25 విద్యాసంవత్సరంలో ఒకటో తరగతిలో 25శాతం ఉచిత సీట్లను లాటరీ పద్ధతిలో ఎంపిక చేయనున్నట్టు ఎంఈవో లీలారాణి బుధవారం తెలిపారు. బుధవారం ఇందుకు సంబంధించిన విధి విధానాలపై స్థానిక ఎమ్మార్సీలో హెచ్ఎంలతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఇతర వివరాల కోసం ఎమ్మార్సీలో తల్లిదండ్రులు సంప్రదించాలని సూచించారు.


హోమ పూజల్లో పాల్గొన్న భక్తులు

ఘనంగా వసంత పంచమి

పలమనేరు: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలోని శ్రీసరస్వతి దేవి సన్నిధిలో బుధవారం వసంత పంచమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. పంచమి గడియలు రాగానే ప్రత్యేక పూజలను చేపట్టారు. లలిత సంగీత విద్యార్థులు అన్నమాచార్య సంకీర్తనలను ఆలపించారు. ఇదే కార్యక్రమం పట్టణంలోని చైతన్య పాఠశాలలోనూ నిర్వహించారు. అక్షరాభ్యాస మహోత్సవాన్ని నిర్వహించారు.

గురుకులంలో ఘనంగా సరస్వతీ పూజ

రొంపిచెర్ల: రొంపిచెర్ల కస్తూర్బా గురుకుల పాఠశాలలో బుధవారం వసంత పంచమిని పురస్కరించుకుని శ్రీసరస్వతీదేవి పూజను ఘనంగా నిర్వహించారు. ఎంఈఓ శ్రీనివాసులు మాట్లాడుతూ ఇంటర్, పదవ తరగతి విద్యార్థులు పట్టుదలతో చదివి మంచి మార్కులు సాధించాలని సూచించారు. ఎస్‌వో సుజాత పాల్గొన్నారు.


పూజలో పాల్గొన్న విద్యార్థులు

క్లుప్తంగా

నేటి నుంచి రథసప్తమి వేడుకలు

చౌడేపల్లె: మండలంలోని చారాల సమీపంలో వెలసిన శ్రీఅన్నపూర్ణాంబ సమేత కాశీవిశ్వేశ్వర స్వామి ఆలయంలో ఈనెల 15 నుంచి మూడు రోజులపాటు రథసప్తమి వేడుకలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. గురువారం కల్యాణోత్సవం, 16న పంచామృతాభిషేకం, అభిషేక పూజలు, అనంతరం స్వామి వారి ఊరేగింపు, సంగీత విభావరి, అన్నదాన కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు. 17న దోపోత్సవంతో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయని తెలిపారు.

పెళ్లి కానుక అందజేత


సాయం అందజేస్తున్న నితిన్ రెడ్డి

రామకుప్పం: మండలంలోని మిట్టపల్లె విద్యా వలంటీర్ రేణుకకు జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి పెళ్లి కానుక అందజేశారు. గురువారం ఆమె ఇంటికి వెళ్లి రూ.10 వేలు అందించారు. పెళ్లికి అవసరమైన సౌకర్యాలను కల్పిస్తానని కుటుంబసభ్యులకు భరోసా ఇచ్చారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.

నేడు టమాట సాగుపై సదస్సు

చౌడేపల్లె: టమాట సాగుచేసే రైతులకు గురువారం ఉదయం 10గంటలకు పొదలపల్లె సమీపంలోని మోహన్‌రెడ్డి నర్సరీ వద్ద నియోజకవర్గస్థాయిలో అవగాహన సదస్సు ఏర్పాటు నిర్వహించనున్నట్లు ఉద్యానవన అధికారి సంతోషి కుమారి తెలిపారు. బెంగళూరు నుంచి ప్రముఖ శాస్త్ర వేత్తలు హాజరై పంట సాగు, దిగుబడి, సస్య రక్షణ మందుల వాడకంపై అవగాహన కల్పిస్తారని పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల తనిఖీ



సదుం: మండలంలోని పలు పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్ నారాయణస్వామి బుధవారం తనిఖీ చేశారు. నడిగడ్డ, చెరుకువారిపల్లె, జోగివారిపల్లె, బూరగమందలో పోలింగ్ కేంద్రాలను పరిశీలించి, వసతులు, సౌకర్యాలను కల్పించడంపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ ఫణికుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

రామకుప్పం: మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో గురువారం ఉదయం 10.30 గంటలకు ఎంపీపీ సుబ్రమణ్యం అధ్యక్షతన మండల సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధాకృష్ణ తెలిపారు. గృహ నిర్మాణం, తాగునీరు, పారిశుధ్యం, వైద్యం, ఆరోగ్యం, వ్యవసాయం, అటవీ, విద్యుత్ శాఖలకు సంబంధించిన సమస్యలపై చర్చ ఉంటుందన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొనాలని తెలిపారు.

మామిడి తోటకు నిప్పు


మంటలను ఆర్పుతున్న ఫైర్ సిబ్బంది

పుంగనూరు: మండలంలోని మల్లువారిపల్లె షుగర్ ఫ్యాక్టరీ సమీపంలో బుధవారం గుర్తుతెలియని వ్యక్తులు మామిడితోటకు నిప్పుపెట్టారు. ఈఘటనలో 20 వేలు నష్టం వాటిల్లినట్లు ఫైర్ ఆఫీసర్ సుబ్బరాజు తెలిపారు. తోటకు చుట్టూ ఏర్పాటు చేసిన కంచె అంటుకోవడాన్ని గుర్తించిన స్థానికులు ఫైర్ ఆఫీసర్‌కు సమాచారం ఇచ్చారు. విషయం తెలిసి ఆయన సిబ్బందితో సంఘటన స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

పెద్దపంజాణి: మండల సరిహద్దులోని రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద కర్ణాటక మద్యం తరలిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాజుపల్లె చెక్‌పోస్టు వద్ద సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేశామన్నారు. ఒక స్కూటీ వాహనాన్ని తనిఖీ చేయగా 120 కర్ణాటక మద్యం ప్యాకెట్లు లభించాయని తెలిపారు. నిందితుడు పుంగనూరు టౌన్ ప్రకాష్ కాలనీకి చెందిన నారాయణప్ప కుమారుడు లింగప్పగా గుర్తించి కేసు నమోదు చేసి రిమాండుకు తరలించినట్లు ఎస్ఐ చెప్పారు. అక్రమంగా మద్యం తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

టిడ్కో పనులు పూర్తి చేయండి

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ పరిధిలో పూనేపల్లి వద్ద నిర్మించిన టిడ్కో గృహ సముదాయాల్లో అసంపూర్తి పనులను త్వరగా పూర్తిచేయాలని నగర కమిషనర్ అరుణ సంబంధిత అధికారులను ఆదేశించారు. కమిషనర్ బుధవారం ఉదయం టిడ్కో గృహ సముదాయాలను తనిఖీ చేశారు. నగరపాలక సంస్థ నీటి శుద్ధి కేంద్రాన్ని పరిశీలించారు. పనులన్నింటినీ వారం రోజుల్లో పూర్తి చేయించాలని టిడ్కో ఈఈ వెంకటముని, కాంట్రాక్టర్లకు సూచించారు. హౌసింగ్ ఏఈ శ్రీధర్, టిడ్కో కన్సల్టెంట్ ధనుంజయరెడ్డి పాల్గొన్నారు.